


"రంగన్నా"........"రంగన్నా"......

గడ్డి పరుపై పడుకుని ఆలోచిస్తున్న రంగన్న లేచి కటకటాల తలుపుదగ్గరకు వచ్చి "ఏమిటన్నట్లుగా?" బయట వున్న పోలీసువేపు చూశాడు.

"రంగన్నా! జైలరుబాబు నిన్ను జ్ఞాపకం చేస్తున్నారు." అంటూ పెద్ద తాళం చెవితో తలుపు తెరిచాడు. రంగన్న గది బయటకువచ్చి జైలరు వుండే ఆఫీసు గదివేపు నడిచాడు. పోలీసు అతన్ని అనుసరించాడు.

రంగన్న శరీరం దృఢంగా వుంది. సాధారణమైన ఎత్తు, ఎత్తునకు తగినలావు, మాసిన గడ్డం, చారలనిక్కరు, చొక్కా, నెత్తిన టోపీ.

సు ధా తా యి

రంగన్న జైలరు గదిలో ప్రవేశించాడు.

జైలరు గదిలో టేబిల్ వెనక కుర్చీలో కూర్చుని కాగితాలు చూసుకుంటున్నాడు. గదిలో ప్రవేశించిన రంగన్నను.... చిరునవ్వుతో స్నేహపూర్వకంగా ఆహ్వానించాడు.

"బాబుగారు నన్ను జ్ఞాపకంచేశారుట ?"

"అవును రంగన్నా....నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి.

రంగన్న చెప్పమన్నట్లు వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"రంగన్నా.... ! రెండున్నర సంవత్సరాలుగా నీ ప్రవర్తన నాకు నచ్చింది. నీలో సోమరితనం లేదు. కష్టపడి పనిచేయగలవు.... పరిస్థితుల ప్రభావంవలన మానవుడు తప్పులు చేయవలసిరావచ్చు....తప్పు చేయని మానవుడంటూ సృష్టిలోనే లేడు.కొందరు తప్పు చేసి శిక్షింపబడవచ్చు. మరి కొందరు తప్పుచేయకున్నా పరిస్థితులు అతన్ని దోషిగా చిత్రింపవచ్చు. ఏమయినా నీ ప్రవర్తన బాగుండుటచే... నీకు ఆరునెల్లు శిక్ష తగ్గించారు. రేపుదయం నిన్ను విడుదల చేస్తారు.

రంగన్న జైలరుబాబు చేప్పేది వింటున్నాడు. అతన్లో దుఃఖంగాని, సంతోషంగాని, కన్పించటం లేదు.

తిరిగి జైలరు "నీవు జైలు నుంచి బయటకు వెళ్లి పనికొలకు వెతుకుతూ బాధపడకుండా ఓ పెద్దమనిషికి ఉత్తరం వ్రాసిస్తున్నాను. అక్కడికి వెళ్లితే నీకు పని దొరుకుతుంది.... ఇంకా.... నీ పనికి లభించిన 'కూలి' నీకు పని దొరికేవరకు ఖర్చుకు అక్కరకు వస్తుంది.

"తమ దయ బాబుగారూ !"

"నా దయ ఏముంది. నీలాంటివాళ్ల సమాజానికి చాల అవసరం. తప్పుచేసి జైలుకు వచ్చినవారిలో మంచిని పెంచి తిరిగి వారిని సమాజంలోకి పంపించటమే మా కర్తవ్యము.

"బాబుగారూ ! అందరూ మీలా ఆలోచించరు."

"సరే ! ఇక నువ్వు వెళ్లవచ్చు" జైలరు తిరిగి కాగితాలు చూసుకోవటంలో మునిగిపోతూ అన్నాడు. రంగన్న బయటకువచ్చి తన గదివేపు నడిచాడు. బయటవున్న పోలీసు అతన్ని అనుసరించాడు.

* * *

జైలు నుండి బయటకు వచ్చిన రంగన్న ఆలోచిస్తూ కాళ్లు తీసుకుపోయిన వేపు నడక సాగించాడు. కాళ్లక్రింద యిసుక. ఎదురుగా అలలతో నిండిన సముద్రం. సాయంకాలపు సమయం. జంటలతో, పిల్లలతో ఆహ్లాదకరంగా వుంది ఆ ప్రాంతం. తనపిల్లలు జ్ఞప్తికి వచ్చారు రంగన్నకు. మనస్సు రంపపుకోతకు గురి అవుతుంది. కాని....

తన నీడ వారిపై పడనీయ దలచుకోలేదు రంగన్న....

ఓ చోట యిసుకలో పడుకొని ఆకాశంవేపు చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

జేబులో జైలరుబాబు రాసిచ్చిన వుత్తరంవుంది. వారేదైనా పని చూయించొచ్చు........లేదా పని వెతుక్కోవాలి....పని....పని....పని.... మనిషికి పనికావాలి. చదువుకున్నా ఉద్యోగం దొరక్కనే ఆటో నడిపి జైలుకు పూర్వం జీవితం వెళ్ళ గూర్చేవాడు....తాను....తనపిల్లి.... అహా....ఆనాడు జీవితంలో ఎంత తృప్తి ...అతని హృదయం వ్యధతో కుమిలి పోయింది. కళ్లలోనీళ్లు నిలిచాయి....

ఆటో రిక్షా రంగన్న....నిజాయితీ పరుడుగా అందరికీ తెలుసు. ఎదుటి వారి ఆనందం తన సంతోషంగా భావించేవాడు. అందరి కష్ట సుఖాల్లో పాలు పంచుకునేవాడు.

దేశ జనాభాలో సగానికిపైన రెక్కలు ఆడితేనే గాని డొక్కలు సగానికి నిండటంలేదు. స్వాతంత్ర్యం లభించనంతకాలం పర ప్రభుత్వాన్ని దూషిస్తూకూచున్నారు. తర్వాత మనవారు పాలకులై కబుర్లతో కాలయాపనలు చేస్తున్నారు. సామాన్యుడి జీవనస్థాయి తరిగిందేకాని, పెరిగిందిలేదు. పాలకులు కాగితాలపై లెక్కలు చూయిస్తున్నారు. కాని ప్రజలకనీస అవసరాలు సమకూరటంలేదు. పేదల బ్రతుకులు ఎన్నడు బాగుపడతాయో? అవి ఆలోచిస్తుండేవాడు రంగన్న.

రంగన్నకు ఓ ఆడ, యిద్దరు మగ పిల్లలు.

"ఇన్స్పెక్టరుగారూ! మీరేమంటున్నారో నాకర్థంకావడంలేదు." కంగారుగా పలికాడు రంగన్న.

"అర్థంకావడంలేదూ! ఎలా అవుతుంది. మీవంటివారికి ఇట్టి పనులు మామూలే. నా సర్వీసులో ఎందర్నో చూశాను. నీవేం చెప్పనక్కరలేదు. ఆ డబ్బెక్కడుందో చెప్పు." చులకనగా అడిగాడు ఇన్స్పెక్టర్.

"బాబూ! అన్యాయంగా నాకు దొంగతనం అంటగడుతున్నారు. నా రిక్షాలో పడిపోయిన పర్సు నా కళ్లబడింది.అది అంతక్రితం ఎక్కిన వారిదే కావాలి. ఎందుకంటే ప్రయాణీకుల్ని దింపిన తర్వాత మళ్లీ క్రొత్తవారిని ఎక్కించుకునే ముందు నా ఆటోని చెక్‌చేసుకుంటాను, నేను. ఈ రోజు నా రిక్షాలో యిదే మొదటి బేరము బాబుగారూ. ఎలా కళ్లబడిందో అలాగే వెళ్లి ఆ అయ్యగారికి అప్పగించాను. వారు డబ్బు చూసుకొని నన్ను ఎగాదిగా చూసి "ఏయ్ యిందులో నుండి ఎంత డబ్బు తీసుకున్నావు?" అంటూ దబాయించి అడిగారు.

నోరు వెళ్ళబెట్టి నేను "డబ్బా! పర్సులోదా! బాబుగారూ!!! నాకేం తెలియదండి. అందులోది నేను చిల్లి కాని ముట్టుకోలేదు. ఎలా చూశానో అలా మీ కప్పగించాను" అంటూ వినయంగా చెప్పాను.

కాని ఆ బాబు "నిజం చెబుతావా? పోలీసులను రప్పించాలా?" అన్నారు. నా మొర విన్పించుకోలేదు. ఇన్‌స్పెక్టరుగారూ! నిజంగా ఆ పర్సులో ఏముందో.... ఎంత డబ్బుందో.... నాకు తెలియదు. నాకు దొరికింది దొరికినట్లు వారి కప్పగించాను.

"రంగన్నా! నీ వక్క వినయాలు చాలించు. నా దగ్గఱ అక్కరకు రావు. అందులో మూడువేల రూపాయలు పోయినట్లు ఫిర్యాదు వచ్చింది. (తనకు దొరికిన వేయి రూపాయలు దృష్టిలో వుంచుకుని) నిజం ఒప్పుకో.... కోర్టులో శిక్ష తగ్గించబడుతుంది. లేదా జైలు పాలవుతావు." అన్నాడు యిన్‌స్పెక్టరు కఠినంగా.

రంగన్న మనస్సు పరిపరి విధాల పోతోంది. అన్యాయంగా చేయని నేరము తన మెడకు పడిందే. తన మంచి పేరు....

"మిస్టర్! 131 ఇతన్ని లాకప్‌లో వెయ్యి" అంటూ కానిస్టేబుల్‌కు ఆదేశ మిచ్చి బూట్లు టకటక లాడించుకుంటూ చేతిలో రూలుకర్రతో స్టేషన్ బయటకు నడిచాడు. క్రొత్తగా రికమెండేషన్‌తో ఎస్. ఐ. గా ప్రమోట్ అయిన హెచ్.సి.

కానిస్టేబుల్ 131 రంగన్నను గదిలోకి తోశాడు.


* * *

వర్షం....వర్షం....వర్షం.... ధారగా కురుస్తోంది. రంగన్నకు మెలుకువ వచ్చింది.... ఆలోచనలు కరిగిపోయాయి. కళ్ళు తిరిగాయి. చుట్టూ చీకటి.... దూరంగా రోడ్డుపైన లైట్లు గ్రుడ్డిగా వెలుగుతున్నాయి. మంద్రంగా సముద్రపు ఘోష.... టైమెంతయిందో తెలియదు. రంగన్నకు పూర్తిగా తెలివి వచ్చింది. కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. వర్షంలో బట్టలు తడిసి ముద్దయ్యాయి. లేచి.... రోడ్డుపైకి వచ్చాడు.

నడక సాగించాడు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వర్షం అలాగే ధారగా కురుస్తోంది.... రోడు కిరుప్రక్కలా నీరు కాలువల నిండుగా ప్రవహిస్తోంది. చల్లని గాలి వీస్తోంది.... రంగన్న చలికి వొణికిపోతున్నాడు....

ఎక్కడైనా హోటలు కనబడుతుందేమోనని చూస్తూ నడుస్తున్నాడు.

నాలుగురోడ్ల కూడలి. ప్రక్కగా పెద్దహోటలు లైట్లు అందంగా వెలుగు




తున్నాయి. త్వరగా హోటల్లో ప్రవేశించాడు. వర్షంలో తడవడంచే దుస్తుల నుండి నీళ్ళోడుతున్నాయి.

ఓ టేబిల్ దగ్గఱ కూర్చున్నాడు.

వెయిటర్ వచ్చి ఆర్డరు కొరకు నిలుచున్నాడు.

టిఫిన్‌కు అర్డరిచ్చాడు రంగన్న.

టిఫిన్ కాఫీ పూర్తిచేసి, బిల్ తీసుకుని కౌంటరు దగ్గరకు వచ్చి జేబులో డబ్బులకి చేయిపెట్టాడు....జేబు ఖాళీ....

అన్ని జేబులు వెతికాడు.... అన్నీ ఖాళీగానే వున్నాయి.... అతని సంపత్తిని ఎవరో కాజేశారు....

దోషిలా తల వంచుకున్నాడు రంగన్న.

ఇలాంటివారిని ఎందరినో చూసిన హోటల్ యజమాని... పోలీసుస్టేషనుకు ఫోన్ చేశాడు....

రంగన్న పారిపోదలచుకోలేదు.